క్లుప్తంగా

'ఆర్‌అండ్‌ఆర్' ఇచ్చాక పనులు చేపట్టాలి



జడ్చర్ల: ఉదండాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనులకు సంబంధించి తమకు ఆర్‌అండ్‌ఆర్ ఇచ్చాక పనులు చేపట్టాలని నిర్వాసితులు డిమాండ్ చేశారు. శనివారం తహసీల్దార్ నర్సింగరావుకు వారు వినతి పత్రం సమర్పించారు. ఇటీవల ఉదండాపూర్‌లో రీసర్వేకు సహకరించామని, తమకు పూర్తిస్థాయిలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పెంచి తమకు అందజేసిన తరువాతనే పనులు మొదలు పెట్టాలని కోరారు. తాజాగా 18 ఏళ్ల వయస్సు నిండిన వారికి ప్యాకేజీ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. తమపై పోలీసులు పెట్టిన కేసులు ఎత్తివేయాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

పీయూలో బ్రోచర్ ఆవిష్కరణ



మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: ఎస్వీ ప్రొఫెషనల్ సంస్థకు చెందిన ట్రెనింగ్–ప్లేస్‌మెంట్ బోచర్‌ను శనివారం పీయూలో రిజిస్ట్రార్ డా.చెన్నప్ప ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంబీఏ, ఎంసాప్స్ విద్యార్థులకు శిక్షణ అందించడానికి, ఎంఎన్‌సీలలో ప్లేస్‌మెంట్‌ను ఆఫర్ చేస్తుందన్నారు. ఇది పీయూలో చదివిన వారికి ఎంతో ఉపయుక్తంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో పీయూ అకడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డా.ఎస్.చంద్రకిరణ్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ డా.ఎస్.ఎన్.అర్జున్‌కుమార్, ఎస్వీ ప్రొఫెషనల్ సంస్థ డైరెక్టర్లు సుధీర్‌రెడ్డి, కొండారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటో బోల్తా : ఇద్దరు మహిళలకు గాయాలు



అడ్డాకుల: మూసాపేట మండల కేంద్రంలోని 44వ నంబర్ జాతీయ రహదారిపై ట్రాలీ ఆటో బోల్తాపడి ఇద్దరు మహిళలకు గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలు.. కామారెడ్డి జిల్లా పీచుకొండకి చెందిన ఐదుగురు ట్రాలీ ఆటోలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కడప జిల్లా మైదుకూరులో ఆదివారం జరిగే పెళ్లికి శుక్రవారం రాత్రి బయలు దేరారు. మార్గమధ్యలో శనివారం మూసాపేట స్టేజీ దాటాక లక్ష్మీదాబా సమీపంలో డ్రైవర్ వెంకటేశ్వర్లు నిద్రమత్తులో ఉండగా ఆటో అదుపుతప్పింది. రోడ్డు మధ్యలో ఉన్న డివైడర్‌కు తగిలి దానిపైనే బోల్తాపడింది. అందులో ఉన్న ఐదుగురిలో లక్ష్మి, రామలక్ష్మికి గాయాలయ్యాయి. వారిని అంబులెన్స్‌లో జిల్లా కేంద్రానికి తరలించారు. బోల్తా పడిన ఆటోను రహదారి నిర్వాహకులు క్రేన్ సాయంతో అక్కడి నుంచి తొలగించారు. ఈ ఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

రెండు దుకాణాల్లో చోరీ



దేవరకద్ర రూరల్: కౌకుంట్లలో రెండు దుకాణాల్లో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. స్థానికులు తెలిపిన వివరాలు.. తహసీల్దార్ కార్యాలయం సమీపంలో ఉన్న ఎరువులు, పెయింట్‌కు సంబంధించిన దుకాణంపై ఉన్న రేకులను కట్‌చేసి లోపలికి చొరబడిన దొంగలు కౌంటర్‌లో ఉన్న రూ.1200 నగదుతో పాటు లాప్‌టాప్‌ను తీసుకెళ్లారు. మరో బేకరి షాపులోకెళ్లి జనరల్ వస్తువులతో పాటు కొంత నగదును అపహరించారు. ఉదయం గమనించిన యజమానులు పోలీసులకు సమాచారమివ్వగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



మహబూబ్‌నగర్ బాలుర కళాశాల మైదానంలో మహిళలను సన్మానిస్తున్న సుప్రభాత్, భారత్ వికాస్ పరిషత్ సభ్యులు



నవాబుపేటలో ముఖ్య అతిథులను సన్మానిస్తున్న మహిళా సంఘాల నాయకురాళ్లు



మహబూబ్‌నగర్‌లో బీజేపీ మహిళా నేతలకు సన్మానం



మిడ్జిల్‌లో..

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి

- ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం
- మహిళలకు క్రీడా పోటీలు
- బహుమతులు ప్రదానం
- పలుచోట్ల మహిళా ఉద్యోగులకు సన్మానం



మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్మికులకు సన్మానిస్తున్న తపస్ నాయకులు



హన్వాడ మండలం దాచక్‌పల్లిలో..

సాక్షి, నెట్‌వర్క్: మహిళలు అన్నిరంగాల్లో రాణించాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. శనివారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలకు ఆట పోటీలు పెట్టి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. అలాగే పలుచోట్ల మహిళా ఉద్యోగులకు ఘనంగా సన్మానించారు.

■ మహబూబ్‌నగర్ జేపీఎన్‌సీ కళాశాలలో మహిళా అధ్యాపకులకు, టీపీఆర్టీయూ ఆధ్వర్యంలో మహిళా ఉపాధ్యాయులకు ఆటల పోటీలు నిర్వహించారు. యూటీఎఫ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. తపస్ ఆధ్వర్యంలో మున్సిపల్ కార్యాలయంలో పారిశుద్ధ్య మహిళా సిబ్బందిని సన్మానించారు. మున్సిపల్ కమిషనర్ మహేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. పద్మావతికాలనీలో పారిశుద్ధ్య కార్మికులను వీబీపీ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షుడు నాగేంద్రస్వామి, మున్సిపల్ జవాన్ సిరాజొద్దీన్ ఆధ్వర్యంలో సన్మానించారు.

■ మహబూబ్‌నగర్ సీపీఐ కార్యాలయంలో భారత మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో మహిళ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి వేడుకలు జరుపుకున్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి బాలకిషన్, శ్యామల, కిరణ్మయి, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

■ మహబూబ్‌నగర్‌లో పాలమూరు రెడ్డిసేవా సమితి మహిళా విభాగం అధ్యక్షురాలు మల్లు సరస్వతి ఆధ్వర్యంలో బీకేరెడ్డికాలనీలో మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ బెక్కరి అనిత పాల్గొని మాట్లాడారు. వైద్యులు లక్ష్మీరేణుక, మయూరిని సన్మానించారు. ఆర్టీసీ బస్టాండ్‌లో వివిధ డిపోల్లో అధిక ఈపీకె తెచ్చిన మహిళా కండక్టర్లను సన్మానించారు. ఉత్తమ డీఎం ఉషను, కల్వకుర్తి డిపో అసిస్టెంట్ డీఎం శ్వేతను సత్కరించారు. ఆర్ఎం సంతోష్‌కుమార్, డిప్యూటీ ఆర్ఎం లక్ష్మీధర్మ పాల్గొన్నారు.

■ మహబూబ్‌నగర్ మండలంలోని మాచన్‌పల్లిలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో మహిళా దినోత్సాన్ని నిర్వహించారు. కడియాల మోహన్, ఉపాధ్యక్షుడు వి.హన్మంతు, మమత, రాజ్యలక్ష్మి, లక్ష్మి, చంద్రమ్మ, నర్సమ్మ, మొగులమ్మ, సత్యమ్మ, శంకరమ్మ పాల్గొన్నారు.

■ మహబూబ్‌నగర్‌లో మహిళా దినోత్సవం సందర్భంగా బీజేపీ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో మహిళా నాయకులను ఘనంగా సన్మానించారు. జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, పద్మజారెడ్డి, సాహితీరెడ్డి పాల్గొన్నారు.

■ మహబూబ్‌నగర్ పాతపాలమూరులోని బీసీ కమ్యూనిటీ హాల్‌లో వన్‌టౌన్ ఉమన్ పీఎస్ ఎస్ఐ శైలజ, సీబీడీ ఎస్ఐ పద్మ, వన్‌టౌన్, టు టౌన్ ఏఎస్ఐలు రాణి, సాయినిర్మల, మాజీ ఎంపీపీ పార్వతమ్మను ఘనంగా సన్మానించారు. జ్ఞాన నీలి మెరుపు బహుజన మహనీయుల శోభయాత్ర ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు.

■ మహబూబ్‌నగర్ బాలుర కళాశాల మైదానంలోని యోగా హాల్‌లో మహిళలను సుప్రభాత్, భారత్ వికాస్ పరిషత్ సభ్యులు సన్మానించారు.

■ నవాబుపేట మండలం కేంద్రంలో సీనియర్ సిటిజన్ ఫోరం ఆధ్వర్యంలో మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ ఇందిరాదేవి, ఐసీడీఎస్ అధికారి రాజరాజేశ్వరిని ఘనంగా సన్మానించారు.సరస్వతి, ప్రమీల, సునీత, ఉమాదేవి, అనసూయ, విమల పాల్గొన్నారు.

■ జడ్చర్లలో మున్సిపల్ ఎంప్లాయిస్ యూనియన్ ఆధ్వర్యంలో అంబేడ్కర్ కళాభవన్‌లో కేక్‌కట్ చేసి మహిళా పారిశుద్ధ్య కార్మికులను శాలువాతో సత్కరించారు. సీనియర్ సిటిజన్స్ ఫోరం ఆధ్వర్యంలో స్వాతంత్ర్య సమరయోధుడు దివంగత చంద్రశేఖర్ సతీమణి సుఖదాదేవిని సత్కరించారు. మహిళా డాక్టర్లతో పలువురిని ఘనంగా సన్మానించారు.



మహబూబ్‌నగర్‌లో రెడ్డిసేవా సమితి..



మహబూబ్‌నగర్‌లో మహిళా అధికారులను..

■ రాజాపూర్ గ్రామ పంచాయతీ కార్యాలయ ఆవరణలో రంగారెడ్డిగూడ మాజీ సర్పంచ్ జనంపల్లి శశికళారెడ్డితో పాటు అంగన్‌వాడీ కార్యకర్తలను సన్మానించారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని ఎంపీఓ వెంకట్‌రాములు అన్నారు.

■ మిడ్జిల్‌తో పాటుగా బోయిన్‌పల్లి, వాడ్యాల్, వేముల, దోనూర్, చిల్వేర్, రాణిపేట్ గ్రామాల్లో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పంచాయతీ కార్యాలయాల్లో మహిళా సిబ్బందిని సన్మానించారు. మాజీ జెడ్పీటీసీ హైమావతి, మాధవి, స్వరూప పాల్గొన్నారు.

■ హన్వాడ మండలంలోని దాచక్‌పల్లిలో మహిళలకు ఆటలపోటీలు నిర్వహించారు. ప్లాస్టిక్ వాడకాన్ని నిర్మూలించాలని ప్రతిన బూనారు. పాల్గొన్న వారందరికీ మట్టిపాత్రలు, గాజు సీసాలను బహుమతులుగా ప్రదానం చేశారు. సురేష్, నర్మద, మంజుల పాల్గొన్నారు.

■ దేవరకద్ర మండలంలోని వెంకటాయపల్లిలో మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళలకు, చిన్నారులకు ఆటల పోటీలు నిర్వహించారు. విజేతలకు బహుమతులను అందజేశారు.



జడ్చర్లలో సుఖదాదేవికి సన్మానం



రాజాపూర్‌లో కేక్ కట్ చేస్తున్న..



దేవరకద్ర మండలం వెంకటాయపల్లిలో ..

కోటీశ్వరులను చేయడమే సీఎం లక్ష్యం

- ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి



భూత్పూర్‌లో మహిళా అధికారులను సన్మానిస్తున్న ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి

భూత్పూర్: రాష్ట్రంలో కోటి మంది మహిళలను కోటీశ్వరులను చేయడమే సీఎం రేవంత్ రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే జి. మధుసూదన్‌రెడ్డి అన్నారు. భూత్పూర్‌లోని ఓ ఫంక్షన్ హాల్‌లో జరిగిన మహిళా దినోత్సవం కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. తహసీల్దార్ జయలక్ష్మి, ఎంఈఓ ఉషారాణి, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ వసీం సుల్తానా, మాజీ ఎంపీటీసీ పద్మ, మున్సిపల్ మహిళా సిబ్బందిని శాలువాలతో ఎమ్మెల్యే సన్మానించారు. మండల మహిళా అధికారులు ఎమ్మెల్యే సతీమణి జి.కవితను శాలువతో సత్కరించారు. పట్టణంలోని ఇందిరా మహిళ శక్తి సంఘానికి రూ.15 లక్షల విలువ గల చెక్‌ను ఎమ్మెల్యే అందజేశారు. మండలంలోని రెండు మహిళా సంఘాలకు సోలార్ పవర్ యూనిట్ నడపడానికి ప్రభుత్వం సంకల్పించిందని త్వరలో యూనిట్లను ప్రారంభించనున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీపీ కదిరె శేఖర్ రెడ్డి, మాజీ సర్పంచ్ చెన్నమ్మ, లిక్కి నవీన్‌గౌడ్, కేసిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, గోవర్ధన్‌గౌడ్, లిక్కి విజయ్‌గౌడ్, నర్సింహులు, శ్రీను పాల్గొన్నారు.

ఇసుక ఎడ్ల బండ్లు పట్టివేత



చిన్నచింతకుంట: మండలంలోని మద్దూరు గ్రామంలో అనుమతుల్లేకుండా అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ఏడు ఇసుక ఎడ్ల బండ్లను శుక్రవారం రాత్రి రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. ఎడ్లబండ్లను తహసీల్దార్ కార్యాలయానికి తరలించి ఇసుకను తహసీల్దార్ కార్యాలయ ఆవరణలో డంప్ చేశారు. ఎడ్ల బండ్ల యజమానులపై చట్టపరంగా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ ఎల్లయ్య తెలిపారు. ఎవరైనా అక్రమంగా ఇసుకను తరలిస్తే చట్టపరంగా చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ట్రాలీ ఆటో..

అడ్డాకుల: మూసాపేట మండలంలో అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాలీ ఆటోను పోలీసులు పట్టుకున్నట్లు ఎస్ఐ వేణు తెలిపారు. వివరాలు.. చక్రాపూర్ శివారులో శనివారం తెల్లవారుజామున పోలీసులు పెట్రోలింగ్ నిర్వహిస్తున్న సమయంలో కనకాపూర్‌తండా వద్ద ట్రాలీ ఆటో కనపడింది. దాన్ని ఆపేందుకు పోలీసులు ప్రయత్నించగా ఆటోడ్రైవర్ దాన్ని వదిలేసి అక్కడి నుంచి పరారయ్యాడు. తనిఖీలు చేయగా ఆటోలో ఇసుక కనిపించింది. ఆటోను పోలీసుకు తరలించిన కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

ఉత్సవాలు ప్రారంభం



నవాబుపేట: మండలంలోని మరికల్, కిష్టంపల్లి గ్రామాల పరిధిలోని కోటచింతల బసవేశ్వర స్వామి ఉత్సవాలు శనివారం ప్రారంభమయ్యాయి. ఉత్సవమూర్తిని మరికల్ నుంచి వీరశైవ సమాజం ఆధ్వర్యంలో నందికోల సేవ, భజనల మధ్య దేవాలయానికి తీసుకువచ్చారు. రుద్రాభిషేకం, బిల్వార్చన, పుష్పార్చన కార్యక్రమాలు నిర్వహించారు. నాలుగు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు పెద్దఎత్తున భక్తులు తరలివస్తారు. కులకచర్ల మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాంమోహన్‌శర్మ, మరికల్ మాజీ సర్పంచ్ పాండు, కిష్టంపల్లి మాజీ సర్పంచ్ సత్యం, నర్సింహరెడ్డి, వీరశైవ సమాజం రాజేష్, ప్రవీన్, నరేందర్, శ్రీనివాస్, యాదయ్య, మధు, మల్లికార్జున్, వెంకటేష్, సత్యరాజు పాల్గొన్నారు

ఈద్గా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి



పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్‌రెడ్డి

స్టేషన్ మహబూబ్‌నగర్: ఈద్గా అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని ఈద్గా వద్ద జరుగుతున్న అభివృద్ధి పనులను శనివారం ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న రంజాన్ పండుగను దృష్టిలో పెట్టుకొని పనులను ముమ్మరం చేయాలని ఈద్గా కమిటీ సభ్యులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, మాజీ కౌన్సిలర్ రాషెద్‌ఖాన్, నాయకులు శ్రీనివాస్‌యాదవ్, ప్రవీణ్‌కుమార్, పులిజాల రవికిరణ్, తులసిరామ్ పాల్గొన్నారు.

రాజీయే రాచమార్గం

- అదనపు కోర్టు న్యాయమూర్తి ముద్దసిర్‌అలీ



మాట్లాడుతున్న అదనపు కోర్టు న్యాయమూర్తి ముద్దసిర్‌అలీ

జడ్చర్ల టౌన్: రాజీయే రాచమార్గమని జడ్చర్ల అదనపు కోర్టు న్యాయమూర్తి ముద్దసిర్‌అలీ అన్నారు. మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో ఆయన పాల్గొని మాట్లాడారు. కక్షిదారులు పరస్పర వైరుధ్యాలు మానుకొని రాజీమార్గం ఎంచుకుంటే సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. లోక్‌అదాలత్ ద్వారా రాజీ చేసుకుంటే భవిష్యత్‌లో మళ్లీ కేసులు వేయటానికి వీలు లేకుండా ఉంటుందన్నారు. లోక్ అదాలత్‌లో 585కేసులు పరిష్కారమైనట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జంగయ్య తెలిపారు. రెండవ తరగతి కోర్టు ద్వారా 462 కేసులు పరిష్కారం అయ్యాయన్నారు. వీటిలో 5బ్యాంక్ కేసులు, ఎన్ఐ యాక్ట్ 1, ఎక్సైజ్ 11, అడ్మిషన్స్ 65, సివిల్ 1, క్రిమినల్ 40 కేసులు ఉన్నాయన్నారు. న్యాయవాదులు మహేశ్వర్‌రెడ్డి, తిరుపతి, యాదిరెడ్డి, రమేష్, శ్రీనివాస్‌గౌడ్, కరీం, ఇఫ్తెకార్, రాములు, విశ్వేశ్వర్‌తోపాటు కోర్టు సిబ్బంది పోలీసులు పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 2,879 కేసులు..

మహబూబ్‌నగర్ క్రైం: జిల్లా కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్‌అదాలత్‌లో పోలీస్ శాఖ నుంచి 2879 కేసులు రాజీ అయినట్లు ఎస్పీ జానకి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వివిధ పోలీస్ స్టేషన్లలో నమోదైన ఐపీసీ కేసులు 407, డ్రంకన్‌డ్రైవ్, ఎంవీఐ యాక్ట్, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘనలు 793, ఈపెట్టీ, బహిరంగ మద్యపానం 1679 కేసులు రాజీ చేసినట్లు పేర్కొన్నారు. 15రోజుల నుంచి పోలీస్ అధికారులు, సిబ్బంది నేరుగా కక్షిదారులను కలిసి రాజీ చేసుకోవడానికి అవగాహన కలిగించినట్లు వెల్లడించారు. త్వరలో కోర్టు సిబ్బందికి, మానిటరింగ్ చేసిన పోలీస్ అధికారులకు రివార్డ్స్ అందిస్తామని పేర్కొన్నారు.

మతిస్థిమితం లేక వృద్ధురాలి ఆత్మహత్యాయత్నం

చిన్నచింతకుంట: మతిస్థిమితం సరిగా లేక ఒంటికి నిప్పు అంటించుకొని ఓ వృద్ధురాలు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన ఘటన మండలంలోని కురుమూర్తి గ్రామంలో చోటు చేసుకుంది. ఎస్ఐ రామ్‌లాల్‌నాయక్ తెలిపిన వివరాలు.. గ్రామానికి చెందిన చాకలి బాలకిష్టమ్మ మతి స్థిమితంలేక శనివారం సాయంత్రం తన ఇంట్లోని దుప్పటికి నిప్పు అంటించి తనపై కప్పుకొని ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గాయాలు కావడంతో గమనించిన చుట్టుపక్కల వారు చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం బాలకిష్టమ్మ ఆస్పత్రిలో చిక్సి పొందుతుంది. ఆమెకు ఒక కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కొడుకు బతుకు దెరువు కోసం పూణేకు వెళ్లి అక్కడే స్థిరపడ్డాడు. కూతుళ్లకు పెళ్లిళ్లు అయ్యాయి. దీంతో బాల కిష్టమ్మ 60 సంవత్సరాల వయసులో మానసిక స్థితి సరిగాలేక పోవడంతో ఒంటరితనాన్ని భరించలేకనే ఆత్మహత్యకు పాల్పడినట్లు వాంగ్మూలంలో పేర్కొందని ఎస్ఐ తెలిపారు.

నిరంతరాయంగా విద్యుత్ సరఫరా

కోయిల్‌కొండ: మండలంలో రైతులకు గ్రామాల్లో నిరంతరాయంగా విద్యుత్ సరఫరాను అందిస్తున్నట్లు విద్యుత్ ఏఈ సత్తయ్య తెలిపారు. శనివారం మండలంలోని దమాయపల్లి లో రైతులతో కలిసి వారి సమస్యలను ఆయన అడిగి తెలుసుకున్నారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. రైతులకు విద్యుత్ రావడంలేదని కొందరు కావాలని ప్రచారం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు.

బెల్లయ్య నాయక్‌కు ఎమ్మెల్సీ ఇవ్వాలి



స్టేషన్ మహబూబ్‌నగర్: రాష్ట్ర ఆదివాసీ కాంగ్రెస్ చైర్మన్ బెల్లయ్య నాయక్‌కు ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ ఇవ్వాలని కేంద్ర పార్టీ అధిష్టానానికి, సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం, మంత్రులకు జిల్లా ఆదివాసీ కాంగ్రెస్ అధ్యక్షుడు లింగంనాయక్ విజ్ఞప్తి చేశారు. స్థానిక కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో అత్యధిక స్థానాల్లో ఆదివాసీ గిరిజనులు ఉన్న ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీని బలపరిచి గెలిపించారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడినాక ఇప్పటివరకు లంబాడీలకు మంత్రి పదవి ఇవ్వలేదన్నారు. ఆయనకు ఎమ్మెల్సీ ఇచ్చి లంబాడీలకు న్యాయం చేయాలని కోరారు. పట్టణ ఆదివాసీ అధ్యక్షుడు రవినాయక్, నాయకులు తులసిరామ్, రాంచందర్ నాయక్, హరినాయక్ పాల్గొన్నారు.

రాజేందర్‌రెడ్డికి 'ఎమ్మెల్సీ' కేటాయించాలి

కోయిల్‌కొండ: నారాయణపేట మాజీ ఎమ్మెల్యే ఎస్.రాజేందర్‌రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని బీఆర్ఎస్ నాయకుడు గోవర్ధన్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. ఎమ్మెల్సీ పదవి రావడంతో వెనకబడిన నారాయణపేట జిల్లాకు రాజేందర్‌రెడ్డి సేవలు అవసరమని, అంతేకాక బీఆర్ఎస్ పార్టీ అభివృద్ధికి ఆయన కృషి చేయడం జరుగుతుందన్నారు. మాజీ సీఎం కేసీఆర్ చొరవ తీసుకొని ఎమ్మెల్సీ పదవి కేటాయించాలని కోరారు.

హైవేపై మురుగునీరు

- భరించలేని దుర్వాసన
- అటుగా వెళ్లాలంటే ముక్కు మూసుకోవాల్సిందే
- పట్టించుకోని అధికారులు
- ప్రయాణికులకు తప్పని తిప్పలు



జాతీయరహదారిపై పారుతున్న మురుగునీరు

జడ్చర్ల టౌన్: జాతీయరహదారి (హైవే)పై మురుగునీరు పారుతోంది. అటుగా వెళ్లాలంటే ప్రయాణికులు ముక్కు మూసుకోవాల్సిన దుస్థితి నెలకొంది. అటు హైవే అధికారులు, మున్సిపల్ సిబ్బంది కానీ పట్టించుకోవడం లేదు. మున్సిపాలిటీ పరిధిలోని 8వ వార్డులో సందర్శిని హోటల్ మొదలు దాదాపు 400 మీటర్ల వరకు మురుగునీరు సర్వీస్‌రోడ్డుపై పారుతూ జాతీయ రహదారిపైకి వస్తోంది. సర్వీస్‌రోడ్డులో ఆర్టీసి బస్సులు, ఇతర భారీ వాహనాలు వెళ్లిన సమయంలో మురుగునీరు పాదాచారులు, ద్విచక్ర వాహనదారులపై పడి కంపు కొడుతోంది. కొద్దినెలలుగా మురుగు పారుతున్నా దానిని నివారించేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవటం లేదు. ఇప్పటికైనా మున్సిపాలిటీ అధికారులు స్పందించి మురుగునీరు రోడ్డుపై పారకుండా చర్యలు తీసుకోవాలని ప్రయాణికులు, స్థానికులు కోరుతున్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

దేవరకద్ర రూరల్: పట్టణంలో ఆదివారం మిషన్ భగీరథ పైపు లీకేజీ పనులు చేపడుతుండటంతో విద్యుత్ సరఫరా అంతరాయం ఉంటుందని విద్యుత్ శాఖ ఏఈ శ్రీకాంత్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 3 గంటల వరకు అమ్మాపూర్ రోడ్డులో ఉన్న కాలనీలతో పాటు, కన్యకాపరమేశ్వరి ఆలయం, పాత పెట్రోల్ బంక్ ఏరియాల్లో కరెంట్ సరఫరా నిలిపివేస్తున్నట్లు పేర్కొన్నారు. కాలనీ వాసులు గమనించి సహకరించాలని కోరారు.

గుంతలమయంగా కొత్తూర్ రోడ్డు

- ఇబ్బందులు పడుతున్న ప్రయాణికులు



కంకర తేలి గుంతలమయంగా మారిన భూత్పూర్- కొత్తూర్ రోడ్డు

భూత్పూర్: మండలంలోని కొత్తూర్ గ్రామానికి వెళ్లే రోడ్డు గుంతలమయంగా మారింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. భూత్పూర్‌లోని వివిధ ప్రభుత్వ కార్యాలయాలకు, నిత్యావసర సరుకులు కొనుగోలు చేసేందుకు నిత్యం ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారు. పదేళ్ల భూత్పూర్ నుంచి వాల్యాతండా, కొత్తూర్ తండాతో పాటు కొత్తూర్ గామస్తులు బీటీ రహదారి నిర్మాణం కోసం మెటల్ రహదారి వేశారు. సమయానికి బీటీరోడ్డు మంజూరు చేయక పోవడంతో కంకర్ తేలి గుంతలుగా మారింది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు చొరవ తీసుకొని కొత్తూర్ రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.